# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## హాస్యనటుడి విషాద కథ

## అల్లు రామలింగయ్య

### (విజయచిత్ర – 1973, జనవరి సంచిక నుంచీ)




అది గత నెల డిసెంబరు 6. షూటింగ్ కు వెళ్ళవలసిన రోజు. ఉదయమే ఫోన్ మ్రోగింది. నిద్ర నుంచి లేచాను. అది నా స్వగ్రామమైన పాలకొల్లు నుంచి వచ్చిన ట్రంకాల్. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. మనస్సంతా శూన్యమైపోయింది. ఇంట్లో వాళ్లకు హీనస్వరంతో ఆ వార్త చెప్పాను. నా భార్యా పిల్లలు నిశ్చేష్టులై నా దగ్గరకు చేరారు. నేను వినకూడనిదీ, విన్నా భరించలేనిదీ, యిటువంటి రోజు రాకూడదని ఎప్పుడూ తలచేదీ అది వచ్చేసింది. అది మా తల్లిగారి అంతిమ ఘడియల వార్త.

మధ్యాహ్నం సుమారు 1 గం. కు హైద్రాబాద్ ఎక్స్ప్రెస్, రాత్రి మెయిలు తప్ప మిగతా రైళ్ళన్నీ రద్దయిన రోజు. అంతిమ ఘడియలు ముగియక ముందే 350 మైళ్ళ దూరంలో వున్న మా గ్రామం చేరుకోవాలనీ

ఆమె చివరి మాట వినాలని ఆవిడ కంటి చూపు చూడాలని నా ఆవేదన. కారులో వెళ్తే రాత్రికే చేరిపోయి అంతిమ దర్శనం చేస్తాననే ఆశ – నిరాశల మధ్యలో, హోరున కురుస్తున్న వర్షంలో నేనూ నా భార్య, నా పెద్ద కుమార్తె బయల్దేరాం. నిట్టూరుస్తూ, చిక్కబట్టుకున్న మనస్సుతో ప్రయాణం ముప్పై మైళ్ళు సాగింది.

మరి కొంత దూరం వెళ్ళేసరికి రోడ్డుకు అడ్డంగా కర్రలు కట్టబడి, ఎదర ఎక్కడో వాగు పొంగిందని దారిలేదని పదిమైళ్ళు వెనక్కు వెళ్ళి, ప్రక్కనున్న పల్లెలు చుట్టి తిరిగి కొంతదూరం వెడితే ట్రంకు రోడ్డు చేరవచ్చునని అక్కడ నుంచి ప్రయాణం చేయవచ్చునని, చెప్పారు. అల్లాగే చుట్టి, మళ్ళా ట్రంకురోడ్డు చేరి పదిమైళ్ళు సాగాము. కొత్తగా కట్టిన బ్రిడ్జి, దాని మీద కారు చెరిసగం కూరుకుపోయే మట్టి, ప్రక్కనున్నది డైవర్షన్ రోడ్డు – తిరగబడిపోయే నీటి ప్రవాహం. మరల నాలో నిరాశ, ఆవేదనతో బయల్దేరిన నాకు దారిలో ఏమిటీ ఆటంకాలు? ఆ కనుచూపు, తుదివాక్కు నేను నోచుకోలేదా? అనే తలంపులతో నిస్తబ్ధుడనైపోయాను. నాకు జతగా బయల్దేరిన మిత్రులు కె. సూర్యనారాయణ కారు దిగి వంతెన వద్ద వున్న వర్కర్సును బ్రతిమిలాడి చాలా క్లిష్టమైన పరిస్థితులలో ఆ కార్మిక సోదరుల సహాయంతో బ్రిడ్జి దాటించగలిగారు.

ఇక పర్వాలేదనుకున్నాం. ఇంకో పదిహేను మైళ్ళు ముందుకు సాగాం. ఎటు చూసినా నీటి ప్రవాహం. ఆ ప్రవాహం మధ్యలో కార్లు తిరగబడిపోయే పెద్ద పెద్ద గోతులతో రోడ్డు. ఒక లారీ వచ్చేవాటిని రానివ్వకుండా వెళ్ళే వాటిని వెళ్ళనివ్వకుండా కూరుకుపోయింది. 60, 70 లారీలు రోడ్డు మీద నిలబడి పోయినై. 2, 3 లారీలు వాగులో పడిపోయినై. ఇది క్లియరు అయినా చిన్న కారు వెళ్ళటం కష్టం అని కొందరు, పర్వాలేదని కొందరు పూరడిస్తున్నా, నిరాశ – నిస్పృహలతో విషాద మనస్కుడైన నన్ను హాస్యనటునిగా చూడ్డానికి వచ్చిన కార్మికులు, లారీ డ్రైవర్సు కుశలప్రశ్నలు – సినిమా సంగతులు అడగనారంభించారు. కారి దిగి చేతులెత్తి దణ్ణం పెట్టి నా దుస్థితిని చెప్పాను. “మీ కారు ఎత్తి అవతల పెట్టేస్తాం. మీకేం భయం లేదు. యీ లారీలు తప్పుకుని ఎదరకు కారు తీసుకురండి” అన్నారు. లాభం లేదని అనుకుంటున్నా కారును ముందుకు సాగించాను. ఎందుకైనా మంచిదని నా భార్యా బిడ్డలను కారు దిగి పొమ్మన్నాను. మిత్రులు సూర్యనారాయణ స్టీరింగు పట్టుకున్నారు. కొంచెం సాగింది కాదు. ఎదర చక్రాలు రెండూ మట్టిలో కూరుకుపోయాయి. ఎదరకు గానీ, వెనకకు గానీ, కారు కదలటం లేదు. సోదర కార్మికులు “పర్వాలేదు పోనీయండి” అంటూనే వున్నారు. వద్దని సోదరలను వాదించి మరల వెనక్కు తోసివేయమని బ్రతిమిలాడుకున్నాను. ఎల్లాగైతేనేం మట్టిలో కూరుకుపోయిన కారు వెనక్కు వచ్చేసింది.

పుట్టెడు దుఃఖం ముంచుకు వస్తున్న నా కళ్ళలో నుంచి మద్రాసు నుంచి బయల్దేరిన హైద్రాబాద్ ఎక్స్ప్రెస్ వెళ్ళిపోతోంది. అందులో వెళ్ళినా, విజయవాడ చేరి అర్ధరాత్రికైనా పాలకొల్లు చేరేవాణ్ణి అనిపించింది. నిలువెత్తు మనుష్యులు నడుం వరకూ కూరుకుపోయే గోతుల్లోంచి లారీలు వెళ్ళసాగాయి. కారును డ్రైవరుకు వప్పజెప్పి ఒక లారీలో వెళ్ళిపోతే బాగుంటుందని, లేదా యీ ఎక్స్ప్రెస్ నైనా అందుకోవచ్చునని తలంపుతో ఓ లారీ డ్రైవరునడిగాను. ‘అయ్యోపాపం రండి’ అన్నాడు. నా కుటుంబంతో సహా లారీ డ్రైవరు ప్రక్కన కూర్చుని ‘ఇప్పుడే వెళ్ళిపోయిన ఎక్స్ప్రెస్ గూడూరులో ఆగుతుంది కదా? ఇక్కడకు గూడూరు ఎన్ని మైళ్ళు వుంటుంద’ ని అడిగాను. 35, 40 మైళ్ళు వుంటుందన్నాడు. కాబట్టి ఆ ఎక్స్ప్రెస్సూ దొరకదు. మళ్ళా అంతా దిగిపోయాం. కారులో కూర్చుని తిరిగి మద్రాసు వెళ్ళిపోదామని తలుస్తుండగా అదే మంచిదని గూడూరు నుంచి ఎదురు వచ్చిన ఒక సోదరుడు ‘మీరిది దాటినా మిగతా వాగులు దాటలేరు’ అని చెప్పగా మద్రాసు తిరిగి వెళ్ళ నిర్ణయించుకున్నాం.

నేను వినాలనుకున్న వాక్కు వినకుండా చేయాలని, నేను చూడాలనుకున్న చూపు కనిపించకుండా జరగాలని–విధి యిల్లా వుందా అని నా దురదృష్టమునకు చింతిస్తూ తిరిగి మద్రాసు బయల్దేరాను. మిత్రుడు సూర్యనారాయణ మొదటి సారి దాటించిన వాగు ప్రవాహ మధికమైపోయింది. తిరిగి మద్రాసు చేరుకునే అవకాశమూ లేదు. యీ విషాదాన్ని ఎలా దిగమింగాలో తోచలేదు. హోరున కురుస్తున్న వర్షంలో కారు దిగాను. ఆ బ్రిడ్జి కంట్రాక్టరుకు నా స్థితిని వెల్లడించాను. అతను దారి చూపి తన పరివారమైన కార్మిక సోదరులను పిల్చి ఆ ప్రవాహం ప్రక్కనున్న వంతెనపై ఇరువైపులా చెక్కలు వేయించాడు. ధైర్యం చేసి పది గజాలు చెక్కలపై ముందుకు సాగించాం. ఒక వైపు చెక్కలు విరిగిపోయి, మరొకవైపు చెక్కలు తిరగబడి కారు ఎదరకు, వెనక్కు కదలకుండా అడ్డుకుంది. ఎంతమంది తోడ్పడ్డా, బయల్దేరిన పాలకొల్లుగానీ, తిరిగి మద్రాసు గానీ, చేరలేని స్థితిలో సోదరులంతా కారును పైకెత్తి చెక్కలు తీసివేసి మరల వెనక్కి గెంటేశారు.

ఎదరకు వెళ్ళలేని వెనక్కురాలేని యీ స్థితిలో, ఉదయం బయల్దేరిన మేము చూసుకునే సరికి సాయంత్రం అయిదు. మద్రాసు నుండి హౌరా మెయిలు రాత్రి గం. 8.50. కారును అక్కడే వుంచివేయదలిచాం. అన్నీ చక్కబడ్డాక మద్రాసు తీసుకురమ్మన్నాం. వంతెన ప్రక్కనున్న డైవర్షన్ రోడ్డు

ముంచివేసి ప్రవహిస్తున్న నీటి తాకిడికి లారీలు, బస్సులు అతిక్లిష్టమైన పరిస్థితులలో దాటటం చూశాం. మదరాసు పోయే ఒక బస్సును కూడా చూశాం. అది బస్సుస్టాండు కాదు. డ్రైవరుకు చేయెత్తి దణ్ణంపెట్టి నా పరిస్థితిని చెప్పాను. అతను మన్నించి బస్సు ఎక్కమన్నాడు. గం. 7.30 లకు మద్రాసు సెంట్రల్ స్టేషన్ ఇంకో మైలు వుందనగా బస్సు స్టాండులో బస్సు ఆగిపోయింది. తడిబట్టలతో నేను, నా కుటుంబం ఫుట్ పాత్ మీద పెట్టె – బేడా పెట్టుకుని టాక్సీ కోసం నిరీక్షిస్తున్నాం. ఖాళీ టాక్సీ ఏమీ కనిపించదు. రిక్షాలో రమ్మని ఓ ప్రక్క రిక్షావాళ్ళు, టాక్సీ తీసుకొస్తాం ఏమిస్తారు అని మరోప్రక్క బ్రోకర్లు అడగసాగారు. ఒక రూపాయిస్తే టాక్సీ తీసుకొస్తానని ఒక బ్రోకరు పరుగెత్తాడు. ఆశతో ఎదురుచూశాం. వెళ్ళిన వాడు రాడు. టాక్సీలు దొరకవు. ఒక జట్కా వాడు వచ్చి మూడు రూపాయలిస్తే సెంట్రల్ స్టేషనులో దింపుతానన్నాడు. తీసుకురమ్మన్నాం.

జట్కాలో కూర్చున్నాం. నడవసాగింది. అనుకోకుండా నా నోటి వెంట సెంట్రల్ స్టేషన్ కు చేరినా యీ రోజు మెయిల్ బయల్దేరడం రద్దయిపోతుందేమోనని వచ్చేసింది. స్టేషనులో దిగాం. మెయిల్ బయల్దేరుతుందని దృఢపర్చుకున్నాం. టిక్కెట్ల క్యూలోకి పరుగెత్తా. యీ క్యూలో ఎప్పుడు టిక్కెట్లు తీసుకోను? నేను వచ్చేవరకు నా తల్లిని కదపవద్దని టెలిగ్రాం ఎప్పుడు యివ్వను? 'మేం వెళ్ళలేదు. తిరిగి మద్రాసే చేరాం.' అని స్టేషను నుండి మా యింటికి ఎప్పుడు ఫోన్ చేయను? అలా ఆవేదనలో క్యూ విడిచిపెట్టి కౌంటరు దగ్గర కెళ్ళాను. కౌంటరు దగ్గరగావున్న తెలుగువాళ్ళు సినిమా నటునిగా ఎరిగున్న నన్ను కుశలప్రశ్నలు వేయగా కుశలంగా లేను అని జవాబు చెప్పుతూ విషయం చెప్పి మీరే నాలుగు టిక్కెట్లు తీసుకునివ్వండి అని, 4 టిక్కెట్లు తాడేపల్లిగూడెం కిమ్మని అడుగగా విజయవాడ, రాజమండ్రి తప్ప గూడెంలో బండి ఆగదు అన్నారు. సరే విజయవాడకే యిమ్మన్నాను. యింటికి ఫోన్ చేసి మేము తిరిగి మద్రాసు సెంట్రల్ స్టేషనుకు చేరామని, మెయిల్లో వస్తున్నామని పాలకొల్లు వైరు యిమ్మని చెప్పాను. బయల్దేరి మమ్మల్ని ఒకసారి రమ్మని నా కుమారునికి ఫోన్ లో చెప్పగా వెంటనే వచ్చాడు. విషయాలన్నీ తొందరగా అతనికి చెప్పుతూండగా బండి సాగింది.

ఉదయం గం. 4.50 కి విజయవాడ చేరింది. గూడెంలో బండి ఆగుతుందని తెల్సుకున్నాం. గూడెంలో దిగాం. బయల్దేరాం. గంటన్నర గడిచింది. పాలకొల్లు సమీపించబోతోంది. నా నిట్టూర్పులు అధికమయ్యాయి. నా గుండెలు బరువెక్కసాగాయి. కాళ్ళుచేతులు వణక నారంభించాయి. బంధు, స్నేహితుల మధ్య కారాగింది. డోర్ తీసుకుని వెళ్ళాను. తెరచివుంటే చూడాలనుకున్న కళ్ళు మూతపడిపోయాయి. వినాలనుకున్న వాక్కులేదని గ్రహించాను. ముఖం మీద పడి "అమ్మా" అని మూడు కేకలు వేశాను. కళ్ళు తెరవలేదు. నోరు విప్పలేదు. ఏడ్చాను. గుండె బరువుతో అంత్యక్రియలకు బయల్దేరాం. చితిమీద పెట్టారు. అగ్ని ముట్టించారు. ఆఖరి సారిగా మళ్ళీ ముఖం చూడాలనిపించింది. పైనున్న కట్టె తొలగించి, తనివితీరా ఆమె ముఖాన్ని కన్నీటితో నిండినవదనంతో చూశాను. 'ఇంక రా' అంటూ చేయిపట్టుకు నన్ను ఎదరకు తీసుకువచ్చారు. అంత్యక్రియలు పూర్తయ్యాయి. యింటికి చేరాం.

మనస్సు నిండా బాధ – బంధుమిత్రులకు చెప్పుకుని బరువు దించుకునే సమయం లేదు. మరుసటి ఉదయం షూటింగుకు వెళ్ళితీరాలి. బాధతో, పెల్లుబుకుతున్న దుఃఖంతో కారులో బయల్దేరాను. సాగనంపడానికి కూడా వచ్చిన మిత్రులు మల్లవరాజు, నాగేశ్వరావులతో బాధను చెప్పుకుని భోరున ఏడ్చాను. గూడెం చేరాం. మెయిలులో బయల్దేరి 8వ తేదీ ఉదయానికి మద్రాసు చేరుకున్నాను.

ప్రేమే దైవమైతే మనం వూహించే దైవం కంటే – కన్నుల నిండా ప్రేమే నింపుకుని తనయులే తన తనువుగా భావించే తల్లే ప్రత్యక్ష దైవమనుకుంటాను. యీ నమ్మికతోటే ఏ శుభకార్యానికి వెళ్ళినా ఆమె పాదాలకు నమస్కరించి బయల్దేరేవాణ్ణి. నా కన్నతల్లి భౌతిక రూపం నాకు యిక లేకపోయినా ఆమె ఎక్కడున్నా ఆమె పాదస్పర్శ నా జన్మంతా నన్ను పులకింపజేస్తూ, "వెళ్ళొస్తానమ్మా" అంటే; "వెళ్ళిరా నాయనా !" అనే ఆ వాక్కు నా చెవుల నిండా నింపుకుంటూనే వుంటాను.

ఆమె తుది కోర్కె ఏమో నాకు తెలియదు గాని – ఆమె ఋణం తీర్చుకొనుటకు ఎన్ని జన్మలైనా ఎత్తాలనే కోరికతో కన్నీటితో ఈ విషాద కథ ముగిస్తున్నాను.

COMMENTS